
సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం | 19 | మార్చి | 2025



పల్లెల్లో పారిచోద్యం
పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. దీంతో పలు గ్రామాల్లో డయేరియా వంటి వ్యాధులు ప్రబలడంతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు.

8లో



సాగుకు నీటి విడుదల
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సాయంత్రం)	సహర్ గురువారం (ఉదయం)
రాజమండ్రి	6.22	4.48
కాకినాడ	6.22	4.48
అమలాపురం	6.22	4.48

న్యూస్‌రీల్

శృంగార వల్లభునికి రూ.28.10 లక్షల ఆదాయం



హుండీ సొమ్ముతో దేవదాయ శాఖ, బ్యాంక్ అధికారులు

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి వారికి అన్నదానం, హుండీల ద్వారా రూ.28,10,646 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. దేవదాయ శాఖ కాకినాడ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్రకుమార్, గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి సమక్షంలో ఆలయంలోని హుండీలను మంగళవారం తెరచి, ఆదాయం లెక్కించారు. మొత్తం 90 రోజులకు గాను హుండీల ద్వారా రూ.21,40,696, అన్నదానం హుండీ ద్వారా రూ.6,69,950 ఆదాయం సమకూరిందని ఈఓ వివరించారు.

మహిళలను మోసగించిన సర్కార్
శాసన మండలిలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



అల్లవరం: అధికారంలోకి వస్తే 50 ఏళ్ల వయస్సు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు నెలకు రూ.4 వేల పింఛన్ పథకాన్ని వర్తింపజేస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ప్రభుత్వ తీరును శాసన మండలిలో మంగళవారం ఆయన ఎండగట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలవుతున్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు పింఛన్లు ఏవని ప్రశ్నించారు. ఈ పథకం కింద బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా మహిళలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 65,49,864 మందికి పింఛన్లు పంపిణీ చేయగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సంఖ్య 63,53,907కు తగ్గిందని తెలిపారు. రెండు లక్షల పెన్షన్లు కోత పెట్టారని విమర్శించారు. ప్రతి నెలా పెన్షన్లు తీసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో పింఛన్ల పంపిణీకి రూ.32,634 కోట్లు అవసరం కాగా, బడ్జెట్‌లో రూ.27,512 కోట్లు మాత్రమే కేటాయించారని, దీనినిబట్టి భవిష్యత్‌లో చాలా పెన్షన్లను తొలగించే అవకాశం ఉందని చెప్పకనే చెబుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలనే ఉద్దేశంతో చేయూత పథకం ద్వారా 45 ఏళ్లు దాటిన వారికి ఏడాదికి రూ.18,750 చొప్పున ఐదేళ్లపాటు అందించి వేలాది కుటుంబాలకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలను అన్ని విధాలా ఆదుకుంటే, కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేస్తోందని ఇజ్రాయిల్ అన్నారు.

రూ.9 వేల కనీస పెన్షన్ ఇవ్వాలి
బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): దేశవ్యాప్తంగా 75 లక్షల మంది ఈపీఎఫ్ పెన్షనర్లకు డీఏతో కలిపి కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలనే డిమాండ్‌తో కాకినాడ ఈపీఎఫ్ఓ కార్యాలయాన్ని పెన్షనర్లు మంగళవారం ముట్టడించారు. ఆలిండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపీఎఫ్ పెన్షనర్స్ ఆర్గనైజేషన్ల పిలుపు మేరకు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడుతూ, 13 సంవత్సరాలుగా ఈపీఎఫ్ పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని అన్నారు. 36 లక్షల మంది కనీసం రూ.వెయ్యి పెన్షన్ కూడా పొందలేని పరిస్థితులు దేశంలో ఉన్నాయన్నారు. ఈపీఎఫ్ వద్ద రూ.8.88 లక్షల కోట్ల కార్పస్ ఫండ్ ఉందని, దీనిపై ఏటా రూ.52 వేల కోట్ల వడ్డీ వస్తోందని చెప్పారు. అయినప్పటికీ పెన్షన్ల రూపంలో కేవలం రూ.14 వేల కోట్లు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. మిగిలిన రూ.38 వేల కోట్లు తిరిగి కార్పస్ ఫండ్‌కు జమవుతోందని తెలిపారు. ఒకవైపు కార్పొరేట్లకు కేంద్రం రాయితీలు ప్రకటిస్తూ, రూ.వేల కోట్ల బ్యాంకు రుణాలు రద్దు చేస్తోందని, మరోవైపు ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ మంజూరు చేయాలంటే సాకులు చెబుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు బాబూరావు, సీనియర్ నాయకుడు రాందాస్ మాట్లాడుతూ, ఈపీఎఫ్ పెన్షనర్లకు సామాజిక పింఛన్లు ఇవ్వాలని, ఉచిత హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, రైలు ప్రయాణాల్లో సీనియర్ సిటిజన్లకు రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రాథమిక మిథ్య!

- పాఠశాలల విలీనానికి కూటమి ప్రభుత్వం పావులు
- వ్యతిరేకత వస్తున్నా తగ్గని సర్కారు
- ప్రజాభిప్రాయ సేకరణ పేరిట బలవంతపు తీర్మానాలు
- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు అంగీకరించాయని చిత్రీకరణ
- 90 శాతం అనుకూలమంటూ నమ్మించే ప్రయత్నం

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందుకు పాఠశాలల విలీన అంశాన్ని తెర పైకి తెచ్చింది. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి, చుట్టుపక్కల పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను అందులో విలీనం చేసే ప్రక్రియకు నాంది పలికింది. ఈ నిర్ణయాన్ని విద్యావేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకిస్తుండటంతో ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో కొత్త నాటకానికి తెర తీసింది. పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతో బలవంతంగా ప్రభుత్వ అనుకూల తీర్మానాలు చేయిస్తోంది. ప్రభుత్వ నిర్ణయానికి ఆమోద ముద్ర వేయిస్తోంది. ఈ బాధ్యతను జిల్లా అధికారులకు అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కదిలిన యంత్రాంగం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 90 శాతానికి పైగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఆమోదం తెలిపినట్లు రికార్డుల్లో పొందుపరిచింది. ఈ విధానం పూర్తి స్థాయిలో అమలులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులు కిలోమీటర్ల దూరం నడిచి పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి తలెత్తుతుంది. దూరం వెళ్లడం ఇష్టం లేని విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమయ్యే అవకాశం ఏర్పడుతుంది.

ఇదీ సంగతి
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కో వ్యవస్థను గందరగోళానికి గురి చేసే ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఈ క్రమంలో ఇప్పుడు విద్యా శాఖ వంతు వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల పునర్నిర్మాణం పేరుతో కొత్త ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ విధానం ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన 117 జీఓను రద్దు చేసి, దానికి ప్రత్యామ్నాయంగా మోడల్ స్కూళ్ల విధానానికి నాంది పలికింది. దూరంగా వెళ్లే విద్యార్థులకు రవాణా చార్జీలు ఇస్తామని నమ్మబలుకుతోంది. ప్రాథమిక విద్యకు విఘాతం కలిగించే ప్రభుత్వ నిర్ణయంపై విద్యావేత్తలు, ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో ప్రజాభిప్రాయ సేకరణ పేరిట స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఆమోదం పొందాలని ఆదేశించింది. కానీ క్షేత్ర స్థాయిలో ఇది పారదర్శకంగా జరగడం లేదు. పాఠశాలల పునర్నిర్మాణంపై వ్యతిరేకత లేకుండా చూడాలనే కూటమి ప్రభుత్వం మౌఖిక ఆదేశాలతో జిల్లా స్థాయి అధికారులు నేరుగా రంగంలోకి దిగి, బలవంతపు తీర్మానాలు చేయించినట్లు సమాచారం.



పెరవలి మండలం అన్నవరప్పాడులో 1, 2 తరగతులకే పరిమితం కానున్న నంబర్-2 పాఠశాల

పునర్నిర్మాణం చేపడతారిలా..
కూటమి ప్రభుత్వం చేపట్టాలనుకున్న పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా ఇక నుంచి శాటిలైట్ స్కూళ్లు (పీపీ-1, పీపీ-2), ఫౌండేషన్ స్కూళ్లు (పీపీ-1, పీపీ-2, అలాగే 1, 2 తరగతులు), మోడల్ ప్రైమరీ స్కూళ్లు (పీపీ-1, పీపీ-2, అలాగే 1 నుంచి 5వ తరగతి వరకు), హైస్కూళ్లు (6 నుంచి 10వ తరగతి వరకు) ఉండేలా ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి, చుట్టుపక్కల పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను అందులో విలీనం చేస్తారు. 60 కంటే ఎక్కువ మంది విద్యార్థులుంటే దానిని యథావిధిగా కొనసాగిస్తారు. మిగతా స్కూళ్లలో కేవలం 1, 2 తరగతులు మాత్రమే నిర్వహించనున్నారు. ఈ విధానంతో ప్రాథమికోన్నత పాఠశాలలు పూర్తిగా కనుమరుగైపోతాయి.

మోడల్ మాకొద్దు
మోడల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్వహించిన అభిప్రాయ సేకరణలో 36.80 శాతం మంది వ్యతిరేకించారు. గతంలో ఉన్న వ్యవస్థనే కొనసాగించాలని కోరుతున్నారు. మిగిలిన వారితో బలవంతంగా తీర్మానాలు చేయించినట్లు తెలిసింది.

మిగులు ఉపాధ్యాయుల పరిస్థితేమిటో?
జిల్లావ్యాప్తంగా 711 ప్రాథమిక పాఠశాలల్లో ఇప్పటి వరకూ ఇద్దరు చొప్పున 1,422 మంది ఉపాధ్యాయులు (ఎస్జీటీ) పని చేస్తున్నారు. 3, 4, 5 తరగతులను మోడల్ స్కూళ్లలో విలీనం చేస్తే ఆయా పాఠశాలల్లో ఇక ఒక్క ఉపాధ్యాయుడే పని చేయాల్సి ఉంటుంది. అంటే మిగిలిన 711 మందిని ఏం చేస్తారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. 117 జీఓ అమల్లో భాగంగా జరిగిన రేషనలైజేషన్‌తో ఏజెన్సీకి వెళ్లిన ఉపాధ్యాయులు ఇప్పట్లో వెనక్కి వచ్చే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం తాజాగా చేపడుతున్న చర్యలతో మిగులు ఉపాధ్యాయుల దారెటన్నది అంతు చిక్కని ప్రశ్నగా మారింది.

స్కూళ్ల పునర్నిర్మాణంపై అభిప్రాయ సేకరణ ఇలా..

జిల్లా	మొత్తం	అభిప్రాయ సేకరణ పూర్తయినవి	ఆమోదం పాఠశాలలు (శాతం)
తూర్పు గోదావరి	953	437	90.10
కాకినాడ	1,203	880	74.51
కోనసీమ	1,571	668	66.07

మోడల్ స్కూళ్లపై అభిప్రాయ సేకరణ వివరాలు

జిల్లా	ప్రతిపాదిత మోడల్ స్కూళ్లు	వ్యతిరేకత (శాతం)
తూర్పు గోదావరి	161	36.84
కాకినాడ	302	34.32
కోనసీమ	177	26.50

కార్పొరేట్‌కు కొమ్ము కాసేలా..
ప్రభుత్వ విద్యా విధానాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలకు మేలు చేకూర్చేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు గణనీయంగా తగ్గి, ప్రైవేటు పాఠశాలల్లో పెరగడమే దీనికి నిదర్శనమని చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే 2025–26 విద్యా సంవత్సరంలో సైతం ప్రవేశాలు ఇంకా దారుణంగా పడిపోయే అవకాశముంటుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అనేక పాఠశాల్లో 1, 2 తరగతుల నిర్వహణకు విద్యార్థులు లేక, స్కూళ్లకు తాళాలు వేయాల్సిన పరిస్థితి తలెత్తుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల నుంచి ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా తీర్మానాలు వస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. భవిష్యత్‌లో తమ బడి మూత పడుతుందనే విషయం వారికి తెలిసే, ఇదంతా జరుగుతోందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యారంగాన్ని పరిరక్షించాలి



ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రభుత్వం కొనసాగించాలి. ఉన్నత పాఠశాలలను డౌన్ గ్రేడ్ చేయకుండా నేచురల్ బారియర్స్ ఉన్న ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదు తరగతులు ఉండేలా చూడాలి. మోడల్ ప్రాథమిక పాఠశాలలతో పాటు ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలి. కొఠారి కమిషన్ చెప్పిన విధంగా ప్రాథమిక విద్యార్థులకు ఒక కిలోమీటర్ లోపు పాఠశాలలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి.

– పి.జయకర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

పంపాకు ఏలేరు నీరు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- అక్విడెక్ట్ పనులకు ఇబ్బంది అన్న 'పోలవరం' అధికారులు
- రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలన్న షణ్మోహన్

అన్నవరం: ఏప్రిల్, మే నెలల్లో జరిగే శ్రీరామ నవమి, సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో స్వామివార్ల చక్రస్నానానికి ఇబ్బంది లేకుండా ఏలేరు నుంచి పంపాకు నీరు ఇవ్వాల్సిందేనని పోలవరం ప్రాజెక్ట్, ఇరిగేషన్ అధికారులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. నీరు లేక ఎండిపోయిన పంపా రిజర్వాయర్‌ను, పంపా గర్భంలో నిర్మిస్తున్న పోలవరం అక్విడెక్ట్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. చక్రస్నాన మహోత్సవాలకు ఇబ్బంది లేకుండా ఏలేరు రిజర్వాయర్ నుంచి పంపాకు రోజుకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయించాలని కోరుతూ అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఈ నెల 11న కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ క్షేత్ర స్థాయి పరిశీలనకు మంగళవారం అన్నవరం వచ్చారు.

ప్రత్యామ్నాయాలపై నివేదిక
పంపా గర్భంలో పోలవరం అక్విడెక్ట్ నిర్మాణ పనులను కలెక్టర్ షణ్మోహన్ పరిశీలించారు. దీనిపై అక్కడే పోలవరం, ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. దేవుని కార్యక్రమాలకు కాకపోయినా, మంచి నీటి సమస్య ఉత్పన్నం కాకుండా పంపాకు ఏలేరు నీరు విడుదల చేయడం అత్యవసరమని అభిప్రాయపడ్డారు. అందువలన పోలవరం నిర్మాణ పనులకు ఆటంకం లేకుండా నీరు విడుదల చేసే మార్గాలు చూడాలని ఆదేశించారు. పోలవరం అక్విడెక్ట్ నిర్మాణాలకు దూరంగా కాలువ తవ్వి, అక్కడి నుంచి నేరుగా లేదా గొట్టాల ద్వారా పంపాకు నీరు పంపించే అంశాన్ని పరిశీలించి, రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని పోలవరం అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీనిపై ఈ వారంలోనే నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ఏలేరు నీరు విడుదల చేస్తే పంపాకు చేరడానికి ఎన్ని రోజులు పడుతుందని ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావును ప్రశ్నించారు. శృంగవరం వద్ద ఉన్న ఏలేరు కాలువ నుంచి పొలాల వెంబడి నీటిని పంపాకు తరలించాల్సి ఉంటుందని, దీనికి పది రోజుల సమయం పడుతుందని ఆయన బదులిచ్చారు. ఈ సందర్భంగా ఏలేరు నీరు పంపాకు చేరే కాలువ మ్యాప్, పోలవరం అక్విడెక్ట్ మ్యాప్‌లను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ సుబ్బారావు, ఈఈలు రామకృష్ణ, నూకరత్నం, ఇరిగేషన్ డీఈ సంతోష్ కుమార్, ఏఈ పద్మజ తదితరులు పాల్గొన్నారు.



పోలవరం అక్విడెక్ట్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

ఇదీ అభ్యంతరం
తొలుత సత్యదేవుని దర్శించిన అనంతరం పవర్ హౌస్ వద్ద పంపా జలాశయంలో చక్రస్నానం నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలించారు. ఏలేరు నుంచి పంపాకు నీటి విడుదలపై ఇరిగేషన్ ఈఈ జి.శేషగిరిరావును ప్రశ్నించారు. నీటి విడుదలకు తమకు ఎటువంటి ఇబ్బందీ లేదని, అయితే నీరు వచ్చే ప్రాంతంలో అక్విడెక్ట్ పనులు జరుగుతున్నందున పోలవరం ప్రాజెక్ట్ అధికారులు అభ్యంతరం చెబుతున్నారని ఆయన తెలిపారు. దీనిపై పోలవరం ఈఈ శ్రీనివాసరావును కలెక్టర్ ప్రశ్నించగా.. ఆయన తమ అభ్యంతరాలను వివరించారు. 2027 కల్లా పోలవరం ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశించారని, అందువలన పంపా గర్భంలో పోలవరం అక్విడెక్ట్ పనులు చేపట్టామని చెప్పారు. అక్విడెక్ట్ పిల్లర్ల నిర్మాణానికి గాను పునాదుల్లో నీరు ఊరకుండా పంపాలో నీటిని తొలగించామని తెలిపారు. ఏలేరు నుంచి పంపాకు విడుదలయ్యే నీరు అక్విడెక్ట్ నిర్మాణ స్థలం పైనుంచి ప్రవహిస్తుందని, దీనివలన పనులకు ఆటంకం కలుగుతుందని వివరించారు.

సేవాభావంతో వైద్య వృత్తి



క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు కప్ అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, వైద్య వృత్తి సేవాభావంతో ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం జరిగిన రాజమహేంద్రవరం మెడికల్ కళాశాల ప్రథమ వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కళాశాలలో గత ఏడాది వైద్య విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించడం శుభపరిణామమని అన్నారు. కష్టపడి చదివి, వైద్యులైన తరువాత అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా 'సౌభాగ్య రక్త మిత్ర' లోగోను కలెక్టర్ ఆవిష్కరించారు. ఒకరు రక్తాన్ని దానం చేయడం వలన ముగ్గురికి ప్రాణ దానం చేయవచ్చని అన్నారు. వైద్యాధికారులు, వైద్య విద్యార్థులతో రక్తదాన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఈ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సూర్యప్రభ, వైస్ ప్రిన్సిపాల్, కె.శివప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.సూర్యారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీవీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి మిర్చికి గట్టి దెబ్బ




- కనుమరుగైన అరుదైన పంట
- తెగుళ్లు, పురుగుల దాడి
- సర్కారు చేయూత లేక సాగు నిలిపివేసిన రైతులు

పిఠాపురం: అరుదైన పంట పొట్టి మిర్చి. దేశ విదేశాల్లోని మిర్చి రకాల్లో పేరొందిన ఈ పొట్టి మిర్చి పుట్టినిల్లు గొల్లప్రోలు మండలం. విత్తు నుంచి, పంట వరకూ అంతా ఇక్కడి రైతుల నైపుణ్యమే. పేరుకు పొట్టి మిర్చి కానీ ఘాటులో మాత్రం ఇది చాలా గట్టిది. ఎర్రగా, గుండ్రంగా చూడడానికి చెర్రీ పండులా కనిపిస్తుంది. పొరపాటున కొరికితే చెంబుడు నీళ్లు తాగాల్సిందే. అంత కారంగా ఉంటుంది. కారంలానే దీని లాభాల ఘాటు కూడా ఎక్కువే. అలాంటి అరుదైన పంట ఇప్పుడు కనుమరుగైంది. దీనిని కాపాడాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇక్కడి రైతులు ఈ పంట సాగు నిలిపివేశారు. ఈ పంట విశిష్టతను గుర్తించిన ఇతర రాష్ట్రాల రైతులు ఇక్కడి విత్తనాలు తీసుకెళ్లి అక్కడ పండిస్తున్నారు.

ఇదీ ప్రత్యేకత
గొల్లప్రోలు ప్రాంతంలోని రేగడి నేలలు వివిధ రకాల పంటల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటాయి. ఇక్కడి రైతులు సాగు చేసే పంటల్లో ప్రధానమైనది మిర్చి. కూరాకులు, సన్నాలు, లావులు, పొట్టి మిర్చి, పచ్చి మిర్చి వంటి రకాలను ఇక్కడ సాగు చేస్తుంటారు. పొట్టి మిర్చిని జిల్లాలోని ఒక్క గొల్లప్రోలు ప్రాంతంలోనే సాగు చేసేవారు. అందుకే దీనిని 'గొల్లప్రోలు మిర్చి' అని కూడా పిలుస్తారు. గొల్లప్రోలు, చేబ్రోలు, దుర్గాడ, చెందుర్తి, తాటిపర్తి, ఎ.విజయనగరం గ్రామాల్లోని 350 మందికి పైగా రైతులు సుమారు 800 ఎకరాల్లో పొట్టి మిర్చి సాగు చేసేవారు. మంచి రంగు, రుచితో ఎక్కువ ఘాటు కలిగి ఉండటం దీని ప్రత్యేకత. దీనిని ఎండు మిర్చికే వాడతారు. మరాఠీ వాసులు అమితంగా ఇష్టపడతారు. 'బోరు' అంటే మరాఠీలో నేరేడు పండు అని అర్థం. నేరేడు పండు సైజులో గుండ్రంగా ఉండటంతో ఈ మిర్చిని వారు 'బోరు మిర్చి' అని పిలుస్తుంటారు. ఉత్తరాది వారు 'బేర్ మిర్చి' అంటారు. ఏటా ఇక్కడ సుమారు 330 టన్నుల పొట్టి మిర్చి దిగుబడి వచ్చేది. ఇక్కడ పండిన పంటలో 90 శాతం మహారాష్ట్రలోని ముంబై, పుణేలకు వ్యాపారులు తరలించేవారు. అక్కడ కారం తయారీకి ఈ మిరప కాయలు ఉపయోగించేవారు. అంతే కాదు.. పొట్టిమిర్చి మహారాష్ట్ర నుంచి పాకిస్తాన్, మలేషియా, శ్రీలంకతో పాటు అరబ్ దేశాలకు సైతం ఎగుమతి అయ్యేది. తద్వారా విదేశీ మారక ద్రవ్యం సైతం వచ్చేది. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహానగరాల్లోని స్టార్ హోటళ్లకు సైతం ఈ పొట్టి మిర్చి కారం సరఫరా చేసేవారు. ఇంతటి విశిష్టత కలిగిన ఈ పంట ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు.



పొట్టి మిరప కళ్లాలు: గొల్లప్రోలు మండలంలో గతంలో ఎక్కడ చూసినా ఇలాంటి దృశ్యాలే.. (ఫైల్)



సొంతంగా విత్తనం తయారీ
ఇక్కడి రైతులు బయటి మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేయరు. సొంతంగానే విత్తనం అభివృద్ధి చేస్తారు. ఇదేవిధంగా పొట్టి మిర్చి విత్తనాలు కూడా తయారు చేసేవారు. పండిన పంటలో నాణ్యమైన కాయలు ఎంపిక చేసుకుని, ఎండబెట్టి విత్తనం సిద్ధం చేసుకునేవారు. వీటిని తోటి రైతులకు సైతం విక్రయించేవారు. ఎకరాకు 70 నుంచి 80 బస్తాల దిగుబడి వచ్చేది. దీనికి తోడు సాధారణ మిరప కంటే మూడు రెట్లు అదనపు ధర లభిస్తుండటంతో గొల్లప్రోలు రైతులు పొట్టి మిర్చి సాగుపై ఎక్కువ ఆసక్తి చూపించేవారు. వాతావరణం అనుకూలిస్తే పెట్టుబడి పోను ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.90 వేల వరకూ ఆదాయం లభించేది. మార్కెట్లో డిమాండ్‌ను బట్టి వ్యాపారులు రైతు పొలంలోనే పొట్టి మిరప కాయలు కొనేందుకు పోటీ పడేవారు. కళ్లంలో బాగా ఎండబెట్టిన తర్వాత వాటిని గ్రేడింగ్ చేసి, బస్తాల్లో నిల్వ చేసేవారు.

పరిశోధనలు ఏమయ్యాయో!
పొట్టి మిరపపై పరిశోధనలు చేసేందుకు కేంద్ర వాణిజ్య పంటల పరిశోధనా సంస్థ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ అగ్రికల్చర్) ఆధ్వర్యాన అప్పట్లో చర్యలు తీసుకున్నారు. పరిశోధనలు సైతం చేశారు. అవేమయ్యాయో ఎవ్వరికీ తెలియని పరిస్థితి. పొట్టి మిర్చిలోని పోషకాల వంటి వాటిపై పరిశోధనలు చేసి, మరింత గుర్తింపు తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. తద్వారా దీనికి మరింతగా గిరాకీ వచ్చి, సాగు విస్తీర్ణం, విదేశీ మారకద్రవ్యం పెరిగే అవకాశాలుంటాయి.

నల్లతామర దాడితో..



గతంలో గొల్లప్రోలు మండలంలో రైతులు పొట్టి మిర్చి సాగు చేసేవారు. మంచి డిమాండ్ ఉన్న పంట కావడంతో ఎక్కువ శ్రద్ధ చూపించేవారు. స్వయంగా విత్తనం తయారు చేసుకోవడం వల్ల పంట బాగా పండేది. నల్ల తామర పురుగు దాడితో దీని సాగు నిలిచిపోయింది. ప్రస్తుతం సాగు పెంచేలా రైతులను సిద్ధం చేస్తున్నాం.

– ఎస్.మల్లికార్జునరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి, కాకినాడ

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,000
గటగట (వెయ్యి)	14,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 - 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పల్లెల్లో పారిచోద్యం

- ప్రబలుతున్న వ్యాధులు
- పది గ్రామాలను చుట్టుముట్టిన డయేరియా
- నమోదవుతున్న కొత్త కేసులు
- పర్యటిస్తున్న అధికారులు
- సూపర్ శానిటేషన్‌కు కలెక్టర్ ఆదేశం
- శుభ్ర పడుతున్న వాటర్ ట్యాంకులు

దేవరపల్లి: పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. దీంతో పలు గ్రామాల్లో వ్యాధులు ప్రబలడంతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. నెలల తరబడి వాటర్ ట్యాంకుల క్లోరినేషన్ చేయకపోవడం, మురుగు కంపు కొడుతున్న డ్రైనేజీలు, దోమల బెడద, అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ వంటి సమస్యలతో గోపాలపురం మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడబడితే అక్కడ రోడ్ల పక్కన పేరుపోయిన చెత్త కుప్పలతో గ్రామాలు స్వాగతం పలుకుతున్నాయి. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయకపోవడం వల్ల కలుషితమైన నీరు తాగి అనారోగ్యాలకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఏదైనా సంఘటన జరిగితే తప్ప అధికారులు, పాలకులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గోపాలపురంలో మంచినీటి ట్యాంకు వద్ద పేరుకుపోయిన చెత్త



పెద్దగూడెంలో మంచినీటి ట్యాంకును శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ముమ్మరంగా శానిటేషన్ పనులు

డయేరియా వ్యాధి విజృంభించడంతో వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీ, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు వ్యాధి లక్షణాలు ఉన్న పది గ్రామాల్లో శానిటేషన్ పనులు ముమ్మరంగా చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో సూపర్ శానిటేషన్ చేపట్టి వాటర్ ట్యాంకులు శుభ్రం చేసి, ఆరబెట్టి క్లోరినేషన్ చేయడం, డ్రైనేజీల్లోని పూడిక తీయడం, రోడ్ల పక్కన గల చెత్తను సంపద కేంద్రాలకు తరలించడం వంటి కార్యక్రమాలను చేస్తున్నారు. పారిశుధ్య పనులను డివిజనల్ పంచాయతీ అధికారి, ఎంపీడీఓ పర్యవేక్షిస్తున్నారు. కొవ్వూరు ఆర్డీఓ సోమవారం రాత్రి వరకు పలు గ్రామాల్లో పర్యటించి వాటర్ ట్యాంకులను పరిశీలించారు.

కొనసాగుతున్న వైద్య శిబిరాలు

గ్రామాల్లో వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయి. 10 గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు రక్త పరీక్షలు చేస్తున్నారు. 20 వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తున్నాయి.

10 గ్రామాలను చుట్టుముట్టిన డయేరియా

డయేరియా వ్యాధి ప్రజలను భయపెడుతోంది. ఐదు రోజులుగా గోపాలపురం మండలంలోని పది గ్రామాలను డయేరియా వ్యాధి చుట్టుముట్టడడంతో దాదాపు 40 మంది స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గోపాలపురం, పెద్దగూడెం, ఉప్పరగూడెం, వేళ్ల చింతలగూడెం, చిట్యాల, పెద్దాపురం గ్రామాలను డయేరియా వ్యాధి చుట్టుముట్టింది. వాంతులు, విరేచనాలతో పలువురు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం సుమారు 30 మంది వ్యాధితో ఆసుపత్రిలో చేరగా, చికిత్స అనంతరం కొంతమంది కోలుకుని ఇళ్లకు చేరారు. ప్రతి రోజు కొత్త కేసులు నమోదవుతుండడంతో పరిస్థితి అధికారులకు అంతుపట్టడం లేదు. సోమవారం ఉదయం ఆసుపత్రిలో 15 మంది చికిత్స పొందుతుండగా, సాయంత్రం కొత్తగా నాలుగు కేసులు నమోదయ్యాయి. దీంతో సుమారు 20 మంది ఆసుపత్రిలో మంచాలపై ఉన్నారు. మంగళవారం ఉదయం ఏడుగురు ఆసుపత్రిలో ఉండగా, మిగిలిన రోగులు కోలుకుని ఇళ్లకు చేరుకున్నారు. అయితే పెద్దగూడెం నుంచి ఉదయం రెండు కేసులు నమోదు కావడంతో ప్రస్తుతం 9 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



గోపాలపురంలోని పెద్దగూడెంలో మురుగునీటితో నీటితో నిండిన డ్రైనేజీ

గ్రామాల్లో సూపర్ శానిటేషన్



"డయేరియా వ్యాధి లక్షణాలు ఉన్న పది గ్రామాల్లో సూపర్ శానిటేషన్ చేస్తున్నాం. పెద్ద పంచాయతీల్లో అదనపు కార్మికులను ఏర్పాటు చేసి శానిటేషన్ పనులు చేస్తున్నాం. ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీల కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్నాం. క్లోరినేషన్ చేసి ప్రజలకు మంచినీరు సరఫరా చేస్తున్నాం. డ్రెయినేజీల్లోని పూడికతీసి తరలిస్తున్నాం.

– వై.అమ్మాజీ, డీఎల్‌పీఓ, కొవ్వూరు

డయేరియా అదుపులో ఉంది



మండలంలో డయేరియా వ్యాధి అదుపులో ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రాత్రి 11 మంది రోగులు ఉండగా, చికిత్స అనంతరం మంగళవారం ఏడుగురు కోలుకుని ఇళ్లకు వెళ్లారు. ఉదయం మరొక రెండు కేసులు నమోదు కావడంతో ప్రస్తుతం ఆరుగురు చికిత్స పొందుతున్నారు. వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయి. 20 వైద్య బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటా సర్వే చేయిస్తున్నాం. డయేరియా వ్యాధి లక్షణాలు ఉన్న వారిని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సేవలు అందిస్తున్నాం. పరిస్థితి చక్కబడింది. వారం రోజులు వైద్యశిబిరాలు కొనసాగుతాయి. డయేరియా సోకడానికి గల కారణాలను తెలుసుకోవడానికి మట్టి, భూగర్భజలాలు, స్టూల్, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించాం. రిపోర్ట్స్ రావలసి ఉంది."

– డాక్టర్ సంధ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, కొవ్వూరు.

క్లుప్తంగా

తప్పిపోయిన బాలుడు తండ్రి చెంతకు..



బాలుడిని అప్పగించిన ట్రాఫిక్ ఎస్సై గరగారావు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్‌లో మంగళవారం మధ్యాహ్నం అనుమానంగా తిరుగుతున్న ఏడేళ్ల బాలుడిని ట్రాఫిక్ ఎస్సై అవుట్ పోస్టు పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు సేకరించి సుమారు మూడు గంటల తరువాత తండ్రి చెంతకు చేర్చిన ఘటన ఇది. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు కథనం ప్రకారం బాలుడు మన్ను దాసు తండ్రి గణేష్ దాస్ ఏడీబీ రోడ్డులోని అపర్ణ టైల్స్‌లో పని చేస్తూ సమీపంలో నివాసం ఉంటున్నారు. తల్లి ఒడిశా వెళ్లడంతో ఒంటరిగా ఇంటి వద్ద ఉన్న కుమాడికి తండ్రి సెల్‌ఫోన్ ఇచ్చాడు. దాంతో ఆడుకొంటూ నడుచుకొంటూ రైల్వే స్టేషన్ సెంటర్‌కు చేరుకున్నాడు. అనుమానంగా తిరుగుతున్న మన్ను దాసును ప్రశ్నిస్తే అడ్రసు చెప్పలేకపోవడంతో బాలుని వద్ద ఉన్న సెల్ ఫోన్ పరిశీలించగా చార్జింగ్ అయిపోయిందన్నారు. దాంతో ఆసెల్‌లోని సిమ్ తీసి వేరే ఫోనులో వేసి బంధువులకు ఫోన్ చేసి వివరాలు సేకరించామన్నారు. బాలుడు తండ్రికి సమాచారం ఇవ్వడంతో మంగళవారం సాయంత్రం అవుట్‌పోస్టు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాడు. అతడికి బాలుడిని క్షేమంగా ట్రాఫిక్ ఎస్సై అప్పగించారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు

కాకినాడ క్రైం: కాజులూరు స్టేట్ బ్యాంక్ సమీపంలో తుపాకీతో సంచరిస్తున్న ఓ అనుమానితుడిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. తిమ్మాపురం పోలీసులు కాకినాడకు తరలించగా రూరల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. ఆ వ్యక్తి బ్యాంకు దోపిడీకి రెక్కీ నిర్వహిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. విచారణలో అందుకు తగ్గ ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ నేపథ్యంలో జరగబోయే నేరాన్ని ముందుగానే గుర్తించామని పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంపై బుధవారం ఎస్పీ బిందుమాధవ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

నేర పరిశోధనల్లో టెక్నాలజీ కీలకం

ఎస్పీ కార్యాలయ రికార్డులు తనిఖీ చేసిన ఐజీ అశోక్ కుమార్

అమలాపురం టౌన్: నేర పరిశోధనల్లో సాంకేతిక పరిజ్ఞానం కీలకమయ్యేలా దర్యాప్తులు, విచారణలు ఉండాలని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ) జీవీకే అశోక్‌కుమార్ జిల్లా పోలీస్ శాఖకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని మంగళవారం ఐజీ సందర్శించారు. ఎస్పీ కార్యాలయంలోని అడ్మినిస్ట్రేటివ్ విభాగాన్ని ఐజీ పరిశీలించారు. ఆ విభాగంతోపాటు జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ), జిల్లా ట్రాఫిక్ రికార్డ్స్ బ్యూరో (డీటీఆర్‌బీ), స్పెషల్ బ్రాంచి విభాగాల రికార్డులను ఐజీ తనిఖీ చేశారు. ఎస్పీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కంట్రోల్ రూమ్‌ను, సోషల్ మీడియా విభాగాన్ని ఐజీ పరిశీలించి సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర పరిశోధనల్లో విరివిగా వాడాలని, జిల్లాలో క్రైమ్ రేటు తగ్గించడంలో సాంకేతిక ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం పనితీరు మెరుగ్గా ఉంటేనే జిల్లాలోని శాంతి భద్రతల పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధన, క్రైమ్ రేటు తగ్గుదల, చోరీలకు గురైన సొత్తుల రికవరీ అనేవి సాకారమవుతాయని ఐజీ అశోక్‌కుమార్ జిల్లా పోలీస్ శాఖకు స్పష్టం చేశారు. ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, ఎస్పీ కార్యాలయ వివిధ విభాగాల సీఐలు బి.రాజశేఖర్, జి.వెంకటేశ్వరరావు, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎస్పీ, ఏఎస్పీ, సీఐలకు సూచనలు ఇస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

సత్రం గదిలో ఖాళీ మద్యం సీసాలపై విచారణ

కలెక్టర్ షణ్మోహన్

అన్నవరం: స్థానిక శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం కొండ దిగువన గల సత్యనికేతన్ సత్రంలోని ఒక గదిలో ఖాళీ మద్యం బాటిల్స్ దొరికిన వైనంపై విచారణ జరుగుతోందని, నివేదిక అందాక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన అన్నవరంలో పంపా నదిని పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కొండ దిగువన సత్రంలో ఘటన జరిగితే రత్నగిరిపై సత్రాలలో జరిగినట్టుగా కొన్ని చానల్స్‌లో వార్తలు రావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మీడియా ప్రతినిధులు పూర్తి వివరాలు తెలుసుకుని వార్తలు ఇవ్వాలని కోరారు. దేవస్థానంలో టాయిలెట్స్ నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు. స్వామివారి నిత్యకల్యాణ మండపం వద్ద గల టాయిలెట్స్‌ను ఆయన తనిఖీ చేశారు. మరింత శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నవరం మెయిన్ రోడ్డులో ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తుడు ఈర్లు శ్రీనివాసరావు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించగా దీనిపై తగు చర్యలు తీసుకోవాలని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, గ్రామ పంచాయితీ కార్యదర్శి చక్రవర్తిని కలెక్టర్ ఆదేశించారు.



రత్నగిరి పై టాయిలెట్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

ఏలేశ్వరం: గత నెల 9వ తేదీన పట్టణంలోని ప్రధాన రహదారిని అనుకుని ఉన్న జ్యూయలరీ షాపులో జరిగిన చోరీలో ముద్దాయిలను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ బిందుమాధవ్ వివరాలు వెల్లడించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం అత్తిరాల గ్రామానికి చెందిన కరణం కుమార్, కడప జిల్లా అట్లూరు మండలం చలంగారేపల్లి గ్రామానికి చెందిన గుమ్మళ్ల వెంకట సుబ్బయ్య కలిసి చోరీకి పాల్పడ్డారన్నారు. మండల పరిధిలోని తిరుమాలి జంక్షన్‌లో రాధాస్వామి సత్సంగ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి చోరీ సొత్తు 32.8 గ్రాముల బంగారం, 11.5 కేజీల వెండి రికవరీ చేశామన్నారు. దీంతో పాటు ఇద్దరు ముద్దాలు పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. నక్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలో 20.450 గ్రాముల బంగారం, తుని పోలీస్‌స్టేషన్ పరిధిలో బజాజ్ పల్సర్‌బైక్, ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 13గ్రాముల బంగారం రికవరీ చేశామన్నారు. ముద్దాయి కరణం కుమార్‌పై 30 వరకు దొంగతనం కేసులు ఉండగా కాకినాడ పీఎస్ పరిధి కేసులో 14 ఏళ్ల జైలు శిక్షపడగా బెయిల్‌పై బయటకు వచ్చాడన్నారు. మరో ముద్దాయి గుమ్మళ్ల వెంకటసుబ్బయ్యపై 11 ఎర్ర చందనం కేసులు, 10 దొంగతనం కేసులు ఉన్నాయన్నారు. వేర్వేరు కేసుల్లో 2023లో కడప జైలులో వీరు కలుసుకున్నారన్నారు. ఇప్పటివరకు నాలుగు జ్యూయలరీ షాపుల్లో చోరీలు చేశారన్నారు. సీఐ సూర్యఅప్పారావు, ఏలేశ్వరం, అన్నవరం, రౌతులపూడి ఎస్సైలు రామలింగేశ్వరరావు, హరిబాబు, వెంకటేశ్వరావు, అన్నవరం అడిషనల్ ఎస్సై ప్రసాద్‌లను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీహరిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

8 నుంచి సైనిక విన్యాసాలు

కాకినాడ సిటీ: కాకినాడ తీరంలోని నేవల్ ఎన్‌క్లేవ్‌లో వచ్చే ఏప్రిల్ 8 నుంచి 13వ తేదీ వరకు భారత్, అమెరికా వాయుసేన దళాలు ఉమ్మడిగా నిర్వహించనున్న టైగర్ ట్రియంఫ్-25 సైనిక విన్యాసాలకు అవసరమైన సివిల్ సహకారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను కోరారు. మంగళవారం ఆయన చాంబర్‌లో సైనిక విన్యాసాల నిర్వహణపై సైనిక, సివిల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సివిల్-మిలటరీ లైజాన్ అధికారి కమాండర్ వైకే కిషోర్ మాట్లాడుతూ భారత్ అమెరికా వాయుసేనల సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి 13వ తేదీ వరకూ టైగర్ ట్రియంఫ్-25 పేరిట ఉమ్మడి సైనిక విన్యాసాలను విశాఖపట్నం, కాకినాడ తీరాలలో నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా ఏప్రిల్ 8 నుంచి 13వ తేదీ వరకూ కాకినాడ తీరంలోని నేవల్ ఎన్‌క్లేవ్‌లో యాంఫీబిఎస్ విన్యాసాలు సముద్రంలోను, ఉపరితలంపైన జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ మేరకు సైనికాధికారులు కోరిన అంశాలపై శాఖల వారిగా చేపట్టాల్సిన చర్యలు డీఆర్వో వెంకటరావు ఆయా శాఖల అధికారులకు సూచించారు. విశాఖపట్నం, కాకినాడల మధ్య సంచరించే రూట్లలో రోడ్ కాన్వాయ్ ఆపరేషన్స్‌కు అవసరమైన సహకారాన్ని సైనిక అధికారులకు అందించాలని సూచించారు. సముద్రంలో విన్యాసాలు జరిగే ప్రాంతానికి సమీపంలోకి మత్స్యకారుల బోట్లు ప్రవేశించకుండా మత్స్యశాఖ, మెరైన్ పోలీస్ శాఖలు కట్టుదిట్టం చేయాలన్నారు. ప్రథమ చికిత్స అందించేందుకు కాకినాడలోని వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి అడ్వాన్సు లైఫ్ సపోర్టింగ్ సిస్టమ్స్ కలిగిన అంబులెన్స్‌లను వారం రోజులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోను కోరారు. సైనిక అధికారి టీవీవీ ప్రసాద్, మెరైన్ పోలీస్ అధికారి రామ్మోహన్‌రెడ్డి, రూరల్ సీఐ చైతన్యకృష్ణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ, మత్స్యశాఖ అధికారి అనూరాధ, కేఎస్పీఎల్, ఫైర్ మెడికల్ అండ్ హెల్త్, పంచాయతీ ఇంటిలిజెన్స్, సమాచారశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరావు

ప్రాణాన్ని బలిగొన్న వారిని అరెస్ట్ చేయాలి



సఖినేటిపల్లి పోలీసు స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, కార్మికులు, పెద్దలు

సఖినేటిపల్లి: స్థానిక సినిమాహాల్ సెంటర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో నిండు ప్రాణాన్ని బలిగొన్న వ్యక్తులను తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసు స్టేషన్ వద్ద ధర్నా చేశారు. వీరికి సంఘీభావంగా ఒలుపు, దింపు కార్మికులు, కొబ్బరి రైతులు, ప్రముఖులు సరెళ్ల విజయ్ ప్రసాద్, గొల్లమందల చిట్టిబాబు, రుద్రరాజు చిన రాజా, రాపాక మహేష్, కుసుమ చింటూ పాల్గొన్నారు. గుడిమూలలో నివాసం ఉంటూ, తునికి చెందిన బత్తిన పైడిరాజు(23) కొబ్బరి దింపులు తీస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. సఖినేటిపల్లిలో రోడ్డు పక్క బైక్‌పై ఆగి ఉన్న పైడిరాజును, ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. దీంతో పైడిరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇందుకు కారకులైన కారులోని నలుగురిని అరెస్ట్ చేయాలని, నిరుపేద అయిన పైడిరాజు కుటుంబానికి తగిన న్యాయం చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో తండ్రి బత్తిన బంగారాజు కన్నీరు మున్నీరుగా విలపించాడు. రోడ్డు ప్రమాదంపై ఇప్పటికే నమోదైన కేసు ఆధారంగా అన్ని కోణాలలో దర్యాప్తు సాగుతోందని, చట్టప్రకారం బాధ్యులపై చర్యలు ఉంటాయని ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు తెలిపారు.

మతి స్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెద్దేవం శివారు రావూరుపాడు బస్టాండ్ వద్ద మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం శివారు రావూరుపాడు బస్టాండ్ వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. నాలుగు రోజులుగా ఇక్కడే ఉంటూ పరిసర ప్రజలు పెట్టిన ఆహారం తింటూ ఉన్నాడని అన్నారు. ఈ క్రమంలో మృతి చెందిన వ్యక్తి మతిస్థిమితం సరిగ్గా లేని వ్యక్తిగా ఉన్నట్టు సమాచారం. ఇతనికి సంబంధించిన వివరాలు తెలిస్తే తాళ్లపూడి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

కొట్లాట కేసులో ఆరు నెలల జైలు

తుని రూరల్: తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన మాసా సింహాచలంకు తుని జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి ఆరు నెలలు జైలు శిక్ష, రూ.పది వేలు జరిమానా విధించినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి మంగళవారం తెలిపారు. 2021లో గ్రామంలో జరిగిన కొట్లాటపై అప్పటి ఎస్సై వై.గణేష్ కుమార్ కేసు నమోదు చేశారన్నారు. సింహాచలంపై నేరం రుజువు కావడంతో శిక్ష విధించినట్టు ఆయన తెలిపారు. రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు ఆధ్వర్యంలో తన సూచనల మేరకు కోర్టు కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం సాక్షులను ప్రవేశపెట్టగా ఏపీపీ లక్ష్మీదేవి కేసు వాదించినట్టు ఆయన వివరించారు.

ఆన్‌లైన్‌లో ప్రొవిజినల్ మెరిట్ లిస్టు

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ పరిధిలో విడుదల చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి ప్రొవిజినల్ మెరిట్ లిస్టును వెబ్‌సైట్‌లో ప్రదర్శించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 ఫార్మసిస్టు, 1 డీఈవో, 4 ఎల్‌జీఎస్ పోస్టులను కాంట్రాక్టు విధానంలో భర్తీ చేసేందుకు గతంలో ఈ నోటిఫికేషన విడుదల చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ పేర్లను ఎన్‌ఐసీ వెబ్‌సైట్‌లో పరిశీలించుకొని అభ్యంతరాలు ఉంటే ఈ నెల 19 నుంచి 20వ తేదీ మధ్య ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో కాకినాడలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు రిటైర్డు ఉద్యోగి మృతి

రామచంద్రపురం: పట్టణంలోని ప్రధాన రహదారిలో మార్కెట్ సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్యాంకు రిటైర్డు ఉద్యోగి మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కేఎస్ఆర్ నగర్‌కు చెందిన పల్లి జీవరత్నం(70) స్టేట్‌బ్యాంకులో పనిచేసి రిటైర్ అయ్యారు. ఈయన మంగళవారం సాయంత్రం మార్కెట్ సెంటర్ నుంచి కేఎస్ఆర్ నగర్‌వైపునకు స్కూటర్‌పై వెళుతున్నారు. అదే సమయంలో సాలూరు డిపో ఆర్టీసీ బస్సు రావులపాలెం వెళుతుండగా జరిగిన ప్రమాదంలో జీవరత్నం తీవ్రంగా గాయపడ్డారు. అక్కడే ఉన్న ఏఎస్సై రాజు హుటాహుటిన స్పందించి స్థానికుల సహాయంతో తీవ్రంగా గాయపడిన జీవరత్నంను ఆటోలో ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జీవరత్నం మృతి చెందారు. ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట బోదెలో పడి వ్యక్తి...

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ శుక్రవారపుపేటకు చెందిన గట్టి సతీష్(44) ద్రాక్షారామ నుంచి కోటిపల్లి వెళ్లే దారిలో రోడ్డు నక్క పంట బోదెలో పడి మృతి చెంది పడి ఉన్నట్లు మంగళవారం మధ్యాహ్నం గుర్తించామని ద్రాక్షారామ హెడ్ కానిస్టేబుల్ సూర్యానారాయణ విలేకరులకు తెలిపారు. ఘటనకు సంబంధించి మృతుడి భార్య గట్టి పెద్దింటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సతీష్‌కి తరచుగా ఫిట్స్ వస్తుంటాయి. రెండు రోజుల క్రితం బయటకు వెళ్లిన అతడు ఇంటికి తిరిగి రాలేదు. అతని కోసం వెతుకుతున్నామని భార్య పిర్యాదులో పేర్కొన్నారు. అతడి మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని ఫిర్యాదులో పేర్కొన్నట్లు హెచ్‌సీ సూర్యనారాయణ తెలిపారు.

పెన్షన్ దక్కక పేద కుటుంబం పాట్లు

90 శాతం వైకల్యం ఉన్నా ఎదురుచూపులు

కడియం: మండలంలోని జేగురుపాడు గ్రామానికి చెందిన 40 ఏళ్ల నాగిరెడ్డి సత్తిబాబు బ్రెయిన్ ట్యూమర్ కారణంగా శరీరం కదల్చలేని పరిస్థితికి చేరాడు. మంచంపైనే అన్నీ చేయాల్సిన స్థితిలో ఉన్నాడు. వ్యవసాయ కూలీ కావడంతో అతడికి వైద్యం చేయించడం, కుటుంబాన్ని పోషించుకోవడం అతడి భార్య చక్రవేణికి శక్తికి మించిన భారమైంది. కనీసం పెన్షన్ అయినా వస్తే మంచంపై ఉన్న సత్తిబాబుకు వైద్యం సక్రమంగా అందుతుందన్న ఆశతో అతడి భార్య తెలిసిన వాళ్ళందరితో మాట్లాడుతోంది. సంబంధిత పత్రాలు పట్టుకుని తిరుగుతోంది. అతికష్టం మీద కాకినాడ తీసుకువెళ్లగా, అక్కడి వైద్యులు 90శాతం వైకల్యం ఉన్నట్లుగా సర్టిఫికెట్ ఇచ్చారు. వీటన్నిటితో పెన్షన్‌కు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ సత్తిబాబుకు మాత్రం పెన్షన్ మంజూరు కాలేదు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి స్వయంగా సత్తిబాబు పరిస్థితిని చూసి, వెంటనే పెన్షన్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినప్పటికీ పెన్షన్ మంజూరు లిస్టులో పేరు మాత్రం రాలేదు. దీంతో మంచంపైనే ఉన్న భర్త, ఇద్దరు పిల్లలతో కుటుంబాన్ని నెట్టుకురావడానికి ఆమె నానా యాతనలు పడుతోంది. ఎవరైనా పలకరిస్తే కన్నీళ్లే ఆమె సమాధానంగా ఉంటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలుగజేసుకుని సత్తిబాబుకు పెన్షన్ మంజూరు చేయించి, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మంచంపై అచేతనంగా ఉన్న సత్తిబాబు